క్లుప్తంగా

బాల వికాస్ కేంద్రాల ప్రారంభం



మహిపాలవీధిలో బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: అమలాపురం మహిపాల వీధి, ఈదరపల్లిల్లో ఏర్పాటుచేసిన బాల వికాస్ కేంద్రాలను శ్రీసత్యసాయి సేవా సంస్థల అమలాపురం జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను సన్మార్గంలో నడిపించేందుకు ఆదిలోనే వారికి నైతిక విలువలపై శిక్షణ ఇచ్చే దిశగా సాగుతున్న బాల వికాస్ కేంద్రాల సంఖ్యను క్రమేపీ పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. అనంతరం బాలవికాస్‌లో కొత్తగా చేరిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ బాల వికాస్ మహిళా కన్వీనర్ సీహెచ్ భవానితో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలను మెరుగు పరుస్తాం

యానాం: ఎస్సీ విద్యార్థుల వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలను మరింత మెరుగు పరచనున్నట్లు ఆది ద్రావిడ శాఖ డైరెక్టర్ ఇలన్ గోవన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్స్‌లో ఎస్సీ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ హాస్టల్స్‌లో ఏసీలు ఏర్పాటుచేయాలని ఎప్పటినుంచో విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారన్నారు. త్వరలోనే సౌకర్యవంతమైన గదులు, క్రీడా సామగ్రిని సైతం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పళని, వేలుమురుగన్ పాల్గొన్నారు.

వైభవంగా బాబా సహవాస

ఐ.పోలవరం: మండలంలోని బాణాపురంలో అవతార్ మెహర్‌బాబాను ప్రతిష్ఠించి మూడు నెలలు పూర్తయిన సందర్భంగా ఆదివారం బాబా సహవాస వైభవంగా నిర్వహించారు. కాకినాడ సెంటర్ నుంచి వచ్చిన చిన్నారులు తమ పాటలతో భక్తులను గానామృతంలో ముంచారు. కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, రమణయ్య రాజు, నందుల ఈశ్వరరావు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద తేనెటీగల దాడిలో అదే ప్రాంతానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో మద్దాల మురళి, బొంతు వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు, తొగరు రాము, కొప్పుని వరలక్ష్మి, యర్రంశెట్టి వీర్రాజు గాయపడ్డారు. తేనెటీగల దాడితో వారంతా అస్వస్థతకు గురయ్యారని, చికిత్స అందించిన అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి మెరుగైందని వైద్యులు తెలిపారు.

మేకల కాపరికి పాము కాటు



అల్లవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఏసేబు

అల్లవరం: మండలంలోని బెండమూర్లంకకు చెందిన మేకలకాపరి ఆవుల ఏసేబు(16) ఆదివారం పాము కాటుకి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఏసేబుని అల్లవరం సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురం తరలించాలని వైద్యులు సూచించారు. ఘటనపై అల్లవరం పోలీసులు ఏసేబు నుంచి వివరాలు సేకరించారు.

జన జాగరణ కార్యక్రమం

ఐ.పోలవరం: ప్రజల్లో దేశభక్తి, ఐకమత్యం పెంపొందించేందుకు ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 3 వరకూ చేపట్టిన జన జాగరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ప్రతినిధులు గుత్తినదీవి, ఐ.పోలవరం, మురమళ్లలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ‘నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష.. మనమిద్దరం ఈదేశానికి, ధర్మానికి రక్ష’ అనే నినాదంతో అందరికీ రాఖీలు కట్టారు. కార్యక్రమంలో రెళ్ల గంగాధర్, ఏలూరి రాంబాబు, పేరాబత్తుల రామకృష్ణ, రేవు సింహాచలం, బొంతు కనకారావు, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై చిత్తశుద్ధి

- యూజర్ చార్జీల వసూళ్లలో అమలాపురానికి 3వ స్థానం
- గత 22 నెలల్లో రూ.1.09 కోట్లు చెల్లించిన ప్రజలు

అమలాపురం టౌన్: ఇళ్లు, వ్యాపార దుకాణాలు, థియేటర్లు, హోటళ్లు, కల్యాణ మండపాలు ఇలా ప్రతిచోటా పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ ‘క్లీన్ ఆంధ్ర ప్రదేశ్’ (క్లాప్) ద్వారా అమలాపురం మున్సిపాలిటీ ఆది నుంచి చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. పట్టణ ప్రజలు సైతం చైతన్యవంతులై క్లాప్ నియమ నిబంధనలకు అనుగుణంగా చెత్త సేకరణ నిమిత్తం యూజర్ చార్జీలు చెల్లిస్తున్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో యూజర్ చార్జీల వసూళ్లలో అమలాపురం మున్సిపాలిటీ మూడో స్థానంలో నిలిచింది. మున్సిపాలిటీల్లో క్లాప్ ప్రారంభమైన గత 22 నెలల కాలంలో ఇప్పటివరకూ మున్సిపాలిటీ రూ.1.09 కోట్లను వసూలు చేసి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు చెల్లించింది. అమలాపురం మున్సిపాలిటీ యూజర్ చార్జీల రూపేణా నెలకు సరాసరిన రూ.6.51 లక్షలు వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా ప్రతి నెలా 80 శాతం వసూళ్లు తగ్గకుండా సిబ్బంది శ్రమిస్తున్నారు.

ఏ కేటగిరీకి ఎంతెంత యూజర్ చార్జీ

ఇంటికి	రూ.50
దుకాణాలకు	రూ.100 నుంచి రూ.2,500
కల్యాణ మండపాలు	రూ.2,500
సినిమా థియేటర్స్	రూ.2,000
ఆసుపత్రులకు	రూ.500 నుంచి రూ.2,500
హోటళ్లు	రూ.1000 నుంచి రూ.2,500
టిఫిన్ సెంటర్స్	రూ.100 నుంచి రూ.250
బ్యాంకులు	రూ.400
ప్రైవేటు విద్యాలయాలు	రూ.1,000 నుంచి రూ.2,000

నిత్యం ఇంటింటా చెత్త సేకరణ

క్లాప్‌లో భాగంగా మున్సిపాలిటీ నివాస గృహాలకు మూడు రంగులతో కూడిన మూడు ప్లాస్టిక్ డస్ట్ బిన్‌లు అందజేసింది. తడి, పొడి, ప్రమాదకర చెత్త ఇలా మూడు కేటగిరీల్లో చెత్తను సేకరిస్తోంది. రోజూ ఉదయాన్నే ఆటో టిప్పరు, పారిశుద్ధ్య కార్మికులు ఇంటి ముంగిట ఆగగానే ఇంట్లో అప్పటికే సేకరించి ఉంచిన మూడు డస్ట్ బిన్‌లను అందించడం, ఆ టప్పర్‌లో వేసుకుని కంపోస్టు యార్డ్‌కు తరలించే ప్రక్రియ జరుగుతోంది. దుకాణాలు, హోటళ్లు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు ఇలా అన్నింటా ఇదే విధానాన్ని పాటిస్తున్నారు. అమలాపురం మున్సిపాలిటీ అధికారులు, వార్డు సచివాలయాల పారిశుద్ధ్య కార్యదర్శులు యూజర్ చార్జీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత–ప్రజల ఆరోగ్య భద్రత’ నినాదంతో క్లాప్ యూజర్ చార్జీలను ప్రజలు సైతం స్వచ్ఛందంగా చెల్లిస్తున్నారు.

జరిమానాలకు అవకాశం లేకుండా

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) సూచనలు, ఆదేశాలతో పరిశుభ్రత, ఆరోగ్య భద్రత కోసం చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లు జరుగుతున్నాయి. ఇలా చార్జీలు వసూలు చేయడంలో వెనకబడి, చెత్త సేకరణలో అలక్ష్యం వహించిన తొమ్మిది రాష్ట్రాలకు ఎన్‌జీటీ రూ.వేల కోట్లు జరిమానాలు విధించింది. మన పొరుగునే ఉన్న తెలంగాణకు రూ.3,800 కోట్లు, కర్ణాటకకు రూ.2 వేల కోట్లు జరిమానా పడింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం చెత్త సేకరణను చిత్తశుద్ధితో పాటిస్తూ యూజర్ చార్జీల వసూళ్లలో క్లాప్ లక్ష్యాలను సాధిస్తోంది.



చెత్త సేకరణ నిమిత్తం యూజర్ చార్జీలను చెల్లిస్తున్న గృహిణులు



ఇంటింటా చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పట్టణంలో ఇళ్లు, వ్యాపార సముదాయాల వివరాలు..

పట్టణంలో ఇళ్ల సంఖ్య
11,909
వ్యాపార సముదాయాల సంఖ్య
1,687
చార్జీలు వసూలు చేసే మొత్తం ఎసెసిమెంట్స్
13,596

ప్రజా సహకారం వల్లే సాధ్యమైంది

ప్రతి నెలా మున్సిపాలిటీ చెత్త సేకరణకు ప్రజల నుంచి దాదాపు 80 శాతం మేర యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నాం. యూజర్ చార్జీల వసూళ్లలో రాష్ట్రంలో మూడో స్థానంలో ఉండడం ప్రజల సహకారం వల్లే సాధ్యమైంది. ఎన్‌జీటీ మార్గదర్శకాలతోనే చెత్తపై యూజర్ చార్జీలను వసూలు చేస్తున్నాం. – ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

చిన్న పరిశ్రమల నుంచే అధిక జీఎస్టీ

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల నుంచే అధికంగా జీఎస్టీ వస్తుందని సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ పద్మశ్రీ పేర్కొన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జులై వరకూ సెంట్రల్ అండ్ స్టేట్ జీఎస్టీ 844.03 కోట్లు వచ్చిందన్నారు. గతేడాది ఇదే సమయానికి గాను రూ.744 కోట్లు మాత్రమే వచ్చిందని, ఈ ఏడాది అదనంగా మరో రూ.100 కోట్లు వసూలైందన్నారు. 13 శాతం జీఎస్టీ రెవెన్యూ వసూళ్లు పెరిగాయన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ మొత్తం రూ.2,370 కోట్లు వసూలైందని, గతేడాదితో పోల్చి చూస్తే రూ.550 కోట్లు అత్యధికమన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్, విద్యుత్ ఉపకరణాలు, ఆటోమొబైల్, ఇనుము, ప్యాకేజింగ్, కెమికల్స్, ఫార్మా తదితర పరిశ్రమల ద్వారా ఎక్కువ జీఎస్టీ వస్తుందన్నారు. ఎంపిక చేసిన ప్రదేశాల్లో వినియోగదారులను ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 1 నుంచి ఇన్‌వాయిస్ ప్రమోషన్ స్కీమ్‌ను అమలుచేస్తామన్నారు.

శ్రీసుబ్బాలమ్మ ఆడియో ఆల్బమ్ ఆవిష్కరణ



ఆడియో ఆల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: ‘శ్రీ సుబ్బాలమ్మ పాహిమాం ...శ్రీ సుబ్బాలమ్మ రక్షమాం’ పేరిట పట్టణానికి చెందిన కవి, జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ ఎస్‌ఆర్‌ఎస్ కొల్లూరి రూపొందించిన భక్తి పాటల ఆడియో ఆల్బమ్‌ను డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ దేవత శ్రీసుబ్బాలమ్మ వైభవం, మహత్యాలపై డాక్టర్ కొల్లూరి భక్తి పూర్వకంగా రచించిన పాటలు భక్తులను రంజింప చేస్తాయన్నారు. అనంతరం రచయిత డాక్టర్ కొల్లూరిని డీఎస్పీ అంబికా ప్రసాద్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బాలమ్మ తల్లి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యానాయుడు, యర్రంశెట్టి మూర్తి, కొత్తపల్లి నాగబాబు, పిండి శేషు, అరిగెల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ఐపీఎస్ అధికారి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఐపీఎస్ అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న నాణేలు, తపాలా బిళ్లల ప్రదర్శన



ప్రదర్శనలో పురాతన నాణేలను చూపిస్తున్న కృష్ణ కామేశ్వర్

అమలాపురం టౌన్: స్థానిక బ్యాంకు స్ట్రీట్‌లో ఆదివారం జరిగిన విశ్రాంత సైనిక ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో పట్టణానికి చెందిన నాణేలు, కరెన్సీ నోట్లు, తపాలా బిళ్లల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ఏర్పాటుచేసిన పురాతన నాణేలు, తపాలా బిళ్లల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రక్షణ దళానికి సంబంధించి భారతీయ తపాలా శాఖ విడుదల చేసిన పలు మినీయేచర్ షీట్లను, 1857 మొదటి స్వాతంత్ర్య సంగ్రామం నాటి రూ.100 నాణెం, 1965 సంవత్సరానికి చెందిన రూ.60 నాణెం, 75 వసంతాల భారత వాయుసేన రూ.100 నాణెం ఈ ప్రదర్శనలో ఉంచారు. అండమాన్ దీవుల్లో మొట్టమొదటిగా భారతీయ జెండాను ఎగురవేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రంతో ముద్రితమైన రూ.75 నాణెం ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోనసీమ మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొల్లంగి ప్రసాద్, ఉపాధ్యక్షుడు దొంగ నారాయణమూర్తి, కార్యదర్శి నండూరి రాంబాబు, విశ్రాంత కల్నల్ రఘువర్మ, గోటేటి గంగాధరరావు, ఆకెళ్ల శర్మ తదితరులు ప్రదర్శనను తిలకించారు.

ఎమ్మెల్యే పొన్నాడకు సత్కారం



ఎమ్మెల్యే పొన్నాడకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

అమలాపురం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా నియమితులైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తలు సత్కరించారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, సంసాని అబ్బు, కుసుమ శ్రీను, ముంగర ప్రసాద్, దూనబోయిన బుజ్జి, దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎల్‌డీసీ ఉద్యోగ రాత పరీక్ష



ఎల్‌డీసీ పరీక్షకు హాజరైన నిరుద్యోగ అభ్యర్థులు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 165 లోయర్ డివిజన్ క్లర్క్, 55 స్టోర్ కీపర్ పోస్టులకు ఆదివారం యానాంలో నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ ఐడెంటీ కార్డు తీసుకొస్తేనే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. యానాం నియోజకవర్గ పరిధిలోని 10 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,835 మంది అభ్యర్థులకు గాను 2,422 మంది హాజరైనట్లు ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సూపర్‌వైజర్లు, ఇన్విజిలేటర్లు తదితర 200 మంది సిబ్బందిని నియమించి పర్యవేక్షించామన్నారు. ఆర్‌ఏఓ మునిస్వామి స్వయంగా పలు పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. గత యుడీసీ పోస్టుల కంటే ఎక్కువగా ఎల్‌డీసీ పోస్టులను యానాం అభ్యర్థులు సాధించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఆకాంక్షించారు.

నిలువెల్లా అల్లుకున్న నిర్లక్ష్యం



కూనవరంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పసిరి తీగలు



సూదాపాలెంలో విద్యుత్ తీగల వెంబడి పాకిన కలుపు తీగలు

ఉప్పలగుప్తం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితిలో భయపెడుతున్నాయి. భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెం, కూనవరం తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు, తీగలకు జాతి పొదులు అల్లుకుని పైకి ఎగబాకి దర్శనమిస్తున్నా విద్యుత్ సిబ్బంది వాటివైపు కనీసం కన్నెత్తైనా చూడడం లేదు. దీనివల్ల వర్షాల వేళ తీగల రాపిడికి గురై విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంతరాయం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పశువులు, చిన్నపిల్లలు పొరపాటున స్తంభాలకు తగిలితే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదముందని భయపడుతున్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యే పొన్నాడకు వినతిపత్రం అందజేస్తున్న పెయ్యల రమేష్ తదితరులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు సమస్యల పరిష్కారం కోరుతూ ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ ఆదివారం వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా గాడిమొగ పంచాయతీ పరిధిలోని బాబానగర్ గ్రామస్తులకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని, తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌పై మొదటి అంతస్తు నిర్మాణ పనులను చేపట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పొన్నాడ సానుకూలంగా స్పందించారని రమేష్ తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, రెడ్డి రెడ్డిబాబు, తాడి షణ్ముఖరాజు, నేరేడిమిల్లి స్వామి, పెయ్యల అంబేడ్కర్, దడాల ప్రసన్నకుమార్ తదితరులున్నారు.

ఇస్రో విజయం ప్రపంచ దేశాలకే మార్గదర్శకం



జిల్లా జన విజ్ఞాన వేదికకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: చంద్రయాన్–3 ద్వారా ఇస్రో సాధించిన విజయం ప్రపంచ దేశాలకే మార్గదర్శకమని జిల్లా జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో జేవీవీ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన మహాసభలో ఇస్రో విజయంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, జేవీవీ యూత్ కన్వీనర్ గుణ తదితరులు ప్రసంగించారు. అనంతరం మహాసభ జేవీవీ జిల్లా నూతన కమిటీని ప్రకటించింది. జిల్లా గౌరవాధ్యక్షులుగా డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ చల్లా రవికుమార్, జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఖాజా మొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా కేవీవీ సత్యనారాయణ, జనుపల్లి సత్యనారాయణ, కోలా వెంకటేశ్వరరావు తదితరులు ఎంపికయ్యారు.

ఘనంగా పరదేశమ్మ తీర్థ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో గ్రామదేవతలు పరదేశమ్మ అమ్మవారు, ముత్యాలమ్మ అమ్మవారు

తాళ్లరేవు: స్థానిక గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాల నడుమ అమ్మవారి పెద్ద జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్థానిక మార్కెట్ వీధిలో ఏర్పాటు చేసిన అంగన్‌గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరదేశమ్మను కొత్త అమ్మవారిగా సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామంలో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కుబడులు సమర్పించుకున్నారు.

ఘనంగా భాగిర్తమ్మ జాతర

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవం భాగిర్తమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ సందడి చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న వీబీటీ రాజు తదితరులు

తాళ్లరేవు: కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) తాళ్లరేవు–యానాం మండలాల నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. స్థానిక లయన్స్ క్లబ్ హాల్ ఆవరణలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా కోకన్వీనర్ బల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తాళ్లరేవు మండల కమిటీ అధ్యక్షుడిగా కేఎస్ ప్రసాద్, కార్యదర్శిగా రెహమాన్ షరీఫ్, కోశాధికారిగా సీహెచ్ మోహన్‌లను ఎన్నుకున్నారు. యానాం కమిటీ కన్వీనర్‌గా చిక్కాల శ్రీనివాస్, కోకన్వీనర్‌లుగా ఎస్.రాంబాబు, డి.త్రిమూర్తులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

భవన నిర్మాణానికి దాతల విరాళం

అమలాపురం టౌన్: పట్టణంలో నిర్మించనున్న కోనసీమ విశ్రాంత సైనిక ఉద్యోగుల సంఘం భవనానికి ఇద్దరు దాతలు రూ.75 వేలు విరాళంగా సమకూర్చారు. స్థానిక గ్రాండ్ పార్కు హోటల్‌లో ఆదివారం జరిగిన విశ్రాంత సైనిక ఉద్యోగుల ఆత్మీయ సదస్సులో విశ్రాంత సైనికులు గంటా వీరన్న రూ.50 వేలు, గోటేటి గంగాధరరావు రూ.25 వేలు విరాళాలుగా అందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంఘ అధ్యక్షుడు అడపా శంకర్ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కోనసీమ సంఘం కార్యదర్శి నండూరి రాంబాబు, కోశాధికారి వెంకటేశ్వరరావు, కాంతారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

అల్లవరం: మండలంలోని తుమ్మలపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుండెపూడికి చెందిన పట్టా ప్రసాద్, కొమరగిరిపట్నానికి చెందిన అల్లవరపు బాలయ్యలు బెండమూర్లంక వైపు ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా ఒకరినొకరు ఢీకొని పడిపోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటీన స్పందించి అమలాపురంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు.